జీవిస్తూ కృత్రిమ గౌరవాల కోసం ఎవరూ ప్రయత్నం చెయ్యకండి. ఇలా కృత్రిమ గౌరవాలకోసం ప్రయత్నం చేస్తే మరల అది పోగొట్టుకోవటానికి మీరు ఎన్నో జన్మలు ఖర్చుపెట్టాలి. ఎవడయితే కృత్రిమజీవితానికి అలవాటు పడ్డాడో, ఎవడయితే కృత్రిమచేష్టలకు, కృత్రిమగౌరవాలకు అలవాటు పడ్డాడో వాడికి జ్ఞానం రాదు. మీ జీవితం సహజంగా ఉంటే, మీ జీవితం సరళంగా ఉంటే, మీ మనస్సు సహజంగా ఉంటే జ్ఞానం దానంతట అదే వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. ఎందుచేతనంటే అది మీ హృదయంలోనే ఉంది. తట్టండి, తెరువబడుతుంది అన్నాడు ఏసు.

సోదర మహాశయులారా! కాలం ఖర్చు అవుతూ ఉంటే బాధపడుతున్నారు, డబ్బు ఖర్చు అవుతూ ఉంటే బాధపడుతున్నారు, మీ ఇంట్లో ఉన్న వస్తువులు ఏమయినా పోతే బాధ పడుతున్నారు. అయితే మనం జ్ఞానం పొందకుండా ఈ జన్మలు పోతూ ఉంటే మీరేమైనా బాధపడుతున్నారా? బంగారం పోతే, రూపాయలు పోతే మీరు బాధపడుతున్నారు కదా. కానీ మీరు జ్ఞానాన్ని సంపాదించకుండా ఈ శరీరాలే పోతున్నాయి కదా అని మీరు ఏమయినా బాధపడుతున్నారా? మీ ఆభరణాలకంటే మీ రూపాయల కంటే మీరు ఎక్కువ కాదా? మీ గురించి మీరు ఆలోచించుకోరా? మీ తలంపులే మీకు శత్రువులు అన్న సంగతి ఈ నాటికి అయినా మీకు తెలిసిందా. మీ తలంపులే మీరు ఆత్మను తెలుసుకోకుండా మిమ్మల్ని ఆత్మకు దూరం చేస్తున్నాయి అన్న సంగతి ఏ నాటికి మీరు తెలుసుకొంటారు. మా బద్ధిర్రాజుగారు చనిపోయాక ఇప్పుడు నాకు కరువల్లా ప్రేమే కరువుగా ఉంది. నాకు బట్టలకు కరువు లేదు, డబ్బుకు కరువు లేదు, బియ్యం కరువు లేదు. కాని ఇప్పుడు నాకు ప్రేమే కరువు. మా బద్ధిర్రాజుగారు చనిపోయాక ఇప్పుడు నన్ను ప్రేమించేవాళ్ళు ఎవరూ కనిపించటం లేదు. హోమియోపతి డాక్టరు బ్రహ్మాజీగారు, ఇంగ్లీష్ డాక్టర్ రామారావుగారు కలిసి నాకు ఆ కరువు తీరుస్తారని నమ్ముతున్నాను.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2016, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదం అంటే జ్ఞానం అని అర్థం. వేదాలలో ఉన్నసారాన్ని వాల్మీకి రామాయణం కింద తీసుకొనివచ్చాడు. మానవుడి జీవితం ఎలా ఉండాలని వేదంలో నిర్ణయింపబడిందో దానిని రామాయణంలో రాముని కథగా వాల్మీకి చెప్పటం జరిగింది. రామాయణం జరిగిందా లేదా అని చర్చకాదు. అది యిచ్చే మెస్సేజ్ ఏమిటి, దాని వలన మనం నేర్చుకొనేది ఏమిటి అది చూసుకోండి. ఏ గ్రంథం చదివినా మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి. ఈ పుస్తకం చదివాము, దాని వలన మనం నేర్చుకొన్నది ఏమిటి అని చూసుకోవాలి. దానిలో మీరు నేర్చుకొనేది ఉంటే

నేర్చుకోండి, లేకపోతే ఆ పుస్తకాన్ని ఒక ప్రక్కన పడేయండి. ప్రపంచానికి సంబంధించిన విషయాలు అన్నీ కూడా వేదంలో చెప్పారు. వేదం యొక్క అంతంలో ఉపనిషత్తులు ఉన్నాయి. ఆత్మజ్ఞానం గురించి, ఏది తెలియబడటం వలన మీరు ఆనందస్థితిని పొందుతారో, మీరు మీరుగా ఉంటారో ఇది అంతా ఉపనిషత్తులలో వర్ణించారు. ఉపనిషత్ అంటే దగ్గరగా కూర్చోవటం. నీ దేహంకంటే, యింద్రియాలకంటే, మనస్సు కంటే అత్యంత సమీపంలో నీ హృదయంలోనే సత్య వస్తువు ఉన్నప్పటికీ నువ్వు దానికి దూరంగా ఉంటున్నావు, అది నీకు గుర్తింపబడటంలేదు. ఉపనిషత్ ఏమి చేస్తుంది అంటే నిన్ను ఆ వస్తువుకు అత్యంత సమీపం లోనికి తీసుకొనివెళ్ళి అంటే హృదయంలోనికి తీసుకొనివెళ్ళి కూర్చోబెడుతుంది. ఉపనిషత్ మంత్రాలను ఋషులు కనిపెట్టలేదు. ఋషులు దర్శించక ముందు కూడా అవి సహజంగా ప్రకృతిలో ఉన్నాయి. కాని ఋషులు దర్శించాక వాళ్ళు దర్శించింది మంత్రరూపంలో లిఖించారు.

కొంతమంది మాట స్పష్టంగా ఉండదు. ఏదో తడబాటుగా మాట్లాడుతూ ఉంటారు. నీ మెదడులో స్పష్టత లేనప్పడు, మనం ఏది చెప్పాలి అనుకొంటున్నామో దాని గురించి మనకే సరిగా తెలియనప్పడు కన్‌ఫ్యూజన్ వస్తుంది. కన్‌ఫ్యూజన్ ఎక్కడ ఉందో అక్కడ క్లారిటీ రాదు. నీ బ్రెయిన్‌లో కనుక క్లారిటీ ఉంటే నువ్వు చెప్పే మాటల్లో క్లారిటీ వస్తుంది. నీ బ్రెయిన్‌లో క్లారిటీ లేనప్పడు నువ్వు చెప్పే మాటలో స్పష్టత ఉండదు, స్వచ్ఛత కూడా ఉండదు. మీరు హిందూమతం గురించి బాగా తెలుసుకోవాలి అంటే మీరు బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్‌లు, భగవద్గీత మూడూ అధ్యయనం చేయాలి. అందుచేతనే పూర్వం గురుకులాలకు వెళ్ళి ఈ మూడూ అధ్యయనం చేసేవారు. చనిపోవటాలు, పుట్టటాలు, రాగద్వేషాలు, లాభ నష్టాలు ఇవన్నీ కూడా వ్యవహారికసత్యాలు. రమణస్వామి ఒక కేవలసత్యాన్నే అంగీకరించారు. వ్యవహారికసత్యాన్ని కూడా ఆయన పట్టించుకోలేదు. ఎక్కడా ఏమీ జరగటం లేదు. కేవలసత్యం గురించి ఉపనిషత్తులలో వివరంగా వర్ణించబడింది. దానిని పూర్వపుఋషులు దర్శించారు. సత్యానికి పుట్టుక లేదు, మరణంలేదు, దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం సుఖం, దాని స్వరూపం శాంతి, దాని స్వరూపం ఉండటం. అన్ని కాలాల్లో, అన్ని ప్రాంతాల్లో ఏదైతే ఎప్పడూ ఉంటుందో అదే సత్యం. మిమ్మల్ని అక్కడకు మేల్కొలపటానికి, ఏ వస్తువుకు అయితే మరణం లేదో, ఏ వస్తువు యొక్క స్వరూపం ఆనందమో అక్కడికి మిమ్మల్ని మేల్కొలపటానికి, దేహబుద్ధి నుండి విడుదలచేసి మిమ్మల్ని మరణంలేని స్థితికి తీసుకొనిపోవటానికి ఉపనిషత్తు ఋషులు కృషి చేసారు.

హృదయంలో అంతర్యామిగా సత్యం ఉంది కాబట్టి అది ఋషులకు దర్శనం ఇచ్చింది.

అక్కడితో ఆగలేదు. అది ఆనాడు ఎంత నిజమో ఈనాడు అంతే నిజం. ఉపనిషత్తు ఋషులు దేనినయితే దర్శించారో దానిని ఈమధ్యకాలంలో రామకృష్ణుడు, రమణమహర్షి వంటి వారు దర్శించి వేదాలలో చెప్పిన సత్యం నిజమేసుమా అని మనకు ఋజువులుగా నిలబడ్డారు. హృదయంలో ఏదో ఒక సత్యపదార్ధం ఉంది కాబట్టి దానిని రామకృష్ణుడు, రమణమహర్షి వంటివారు అనుభవైకవేద్యం చేసుకొన్నారు. వారు అనుభవం పొందటమే కాకుండా దాని తాలూక అనుభవం మనం కూడా పొందటానికి సహకారం అందిస్తున్నారు. ఆ ఋషి యొక్క పరంపర ఇప్పటికి కూడా కంటిన్యూ అవుతోంది. అవి జీవనదులు. అందరి హృదయాలలో అంతర్యామిగా నేను ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు కదా. అసలు వాడు ఉన్నాడు కాబట్టి కొంతమందికి అయినా దర్శనం అయ్యింది కదా. అలా దర్శించినవారు ఇప్పుడు సజీవంగా కొంతమంది మనకు కనిపిస్తున్నారు కదా. అందుచేత మనం భగవంతుడు చెప్పిన మాట మీద విశ్వాసం ఉంచి, ఆయన చెప్పిన  పద్ధతిలో కనుక జీవిస్తే ఆయన మనకు ఎఱుక లోనికి వస్తాడు. అంటే హృదయంలో ఉన్న సత్యం మనకు ఎఱుకలోనికి వస్తుంది. మన యింద్రియాలతో, మనస్సుతో, బుద్ధితో దానిని మనం పట్టుకోలేము. మన బుద్ధికి అది ఒక ఆబ్జక్టు కాదు. నువ్వు దానిని తెలుసుకోవాలి అనుకొంటున్నావు రైటే, అంతమాత్రంచేత అది నీకు తెలియబడదు. మీకు తెలియబడాలి అని అది అనుకొంటేనే తెలియబడుతుంది కాని మీకు తెలియబడటానికి అది సిద్ధంగా లేకపోతే మీరు ఎంత సాధన చేసినా అది మీకు తెలియబడదు. ఎందుచేతనంటే మీ హృదయంలో ఉన్న వస్తువు జడం కాదు. మీ జీవిత విధానం దానికి అంగీకారం అవ్వాలి. మనుషులందరూ మేము మంచివాళ్ళము అని అనుకొంటారు. మరి అందరూ మంచివాళ్ళే అయితే అందరికి జ్ఞానం ఎందుకు రావటం లేదు. మనం మంచివారము అని మనలో మనం అనుకోవటం కాదు. మనం మంచివారము అని భగవంతుడు అనుకోవాలి. ఆయన చేత ఎవడయితే ఎన్నుకోబడ్డాడో వాడికి మాత్రమే ఆయన తెలియబడతాడు అని వేదంలో ఉంది. మీకు ఉన్న ధనం వలన కాని, చదువు వలన కాని, కీర్తి వలన కాని, సంతానం వలన కాని మీకు భగవంతుడు తెలియబడడు. బాహ్య కారణాలవలన, బాహ్యపరిస్థితుల వలన మీకు భగవంతుడు తెలియబడడు. మీరు హృదయంలో ఎలా ఉన్నారు అది భగవంతుడు చూసేది. మీరు ఏదో మంచిపని చేసారు, ఏ తలంపుతో ఆ మంచిపని చేసారు, అసలు నీ హృదయంలో నువ్వు ఎలా ఉన్నావు అని చూసి నీకు స్పిరిట్యువల్ స్టేటస్ భగవంతుడు యిస్తాడు కాని బయట చమత్కారాల వలన, నువ్వు చేసే ఫిజికల్ ఎక్సర్‌సైజ్ వల్ల భగవంతుడు నీకు తెలియబడడు. అసలు నీ మాటకు, చేతకు, హృదయానికి ఏమయినా సంబంధం ఉందా? ఈ మూడింటికి సమన్వయంఉందా? వీటికి సమన్వయం లేదు అనుకో ఇంక

నీకు జ్ఞానం ఎలా వస్తుంది.

పండితులు అందరూ మాకు జ్ఞానం ఉంది అనుకొంటున్నారు. పాండిత్యం వలన జ్ఞానం రాదు. భగవంతుని స్వరూపం పొందినవాడు మాత్రమే జ్ఞాని. ఒక్క జ్ఞాని మాత్రమే నా స్వరూపాన్ని పొందుతాడు అని పరమాత్మ గీతలో చెప్పాడు. పాండిత్యానికి జ్ఞానానికి ఏమీ సంబంధం లేదు. పాండిత్యమే జ్ఞానం అని చాలామంది అనుకొంటున్నారు, అది చాలా పొరపాటు. రమణమహర్షి గారు ఈ భూమి మీదకు వచ్చి చేసిన ఉపకారం ఏమిటి అంటే పాండిత్యాన్ని జ్ఞానం అనుకోకూడదు. పాండిత్యం వేరు, జ్ఞానం వేరు అని ఈ లోకానికి తెలియచేసారు. ఇది రామకృష్ణపరమహంసగారు కూడా చెప్పారు. సిటీలో ఉన్న ప్రముఖులు, బాగా చదువు కొన్నవారు, ఉపకారాలు చేసేవాళ్ళు కొంతమంది రామకృష్ణుడిని మా యింటికి రండి అని ఆహ్వానించేవారు. ఆయనకు వెళ్ళాలి అని ఉంటే వెళ్ళేవారు. తిరిగి దక్షిణేశ్వరం వచ్చేటప్పడు వీరు పండితులు, వీరు పది కాలేజీలు కట్టారు సమాజానికి ఉపయోగపడు తున్నారు అని ఆయన కూడా ఉన్న భక్తులు రామకృష్ణుడితో చెప్పేవారు. ఆ మాటలు అన్నీ రామకృష్ణుడు వినేవాడు. వారు పండితులు, వారు కాలేజీలు కట్టారు అని చెపుతున్నారు, మంచిదే. దానికి జ్ఞానానికి సంబంధం ఏమిటి? మీరు చెప్పేవారికి ఒక్కడికి తోక తెగలేదు అంటే దేహాభిమానం పోలేదు. వారికి జ్ఞానం ఉండి అదనంగా ఏదయినా ఉంటే నేను సంతోషిస్తాను. అసలు ఉండవలసింది లేదు కదా. స్వరూప జ్ఞానం లేకుండా లోకంలో ఏది సాధించినా అవిఅన్నీ ఒకటి లేని సున్నాలతో సమానము. మీరు స్వప్నంలో నుండి జాగ్రదవస్థ లోనికి రాగానే ఆ స్వప్నం ఎంత అసత్యం అని మీకు తెలుస్తుందో అలాగే మీకు జ్ఞానోదయం అయిన వెంటనే ఈ లోకంలో మీరు సాధించినవి అన్నీ కూడా డ్రీమ్‌స్టఫ్ అని మీకు అనుభవం లోనికి వస్తుంది. పండితుడు అనేవాడు దేనిని పొందటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ట్రూత్‌ను రియలైజ్ చేయటానికి పాండిత్యాన్ని ఉపయోగించుకొంటున్నాడా? అందుచేత పండితులను కాని, ధనవంతులను కాని రామకృష్ణుడు పట్టించుకోలేదు. మనలను ఎలా పలకరిస్తాడో వారిని అలాగే పలకరించేవాడు. వారికి డబ్బు ఉన్నమాట నిజమే. పాండిత్యం ఉన్నమాట నిజమే అయితే హృదయంలో ఎలా ఉన్నారు? వారు హృదయంలో పెద్ద సున్నలు.

గురువు లేకుండా కొంతమందికి జ్ఞానం వస్తోంది కదా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. గురువు లేకుండా జ్ఞానం పొందిన వారు ఉన్నారు. వాళ్ళయొక్క పూర్వజన్మ సంస్కారాలను బట్టి, వారి బుద్ధి పరిపక్వతను బట్టి వారికి గురువు లేకపోయినా ఈశ్వరుని దయవలన స్వరూపజ్ఞానం కలుగవచ్చు. వారు బాగా ఎడ్వాన్స్‌డ్ సోల్స్ అయిఉంటారు.

అటువంటి వారు ఉండవచ్చు. అయితే ఎవరో ఒక్కరికో ఇద్దరికో అలా గురువు లేకుండా వచ్చింది అని గురువు అక్కరలేదు అని చెప్పటానికి వీలులేదు, గురువు అవసరమే అన్నారు భగవాన్. రమణస్వామి మరణానుభవం ద్వారా మరణాన్ని జయించారు అంటే ఆయనకు మరణభయం పోయింది. ఆయనకు భౌతికంగా గురువు లేడు కాని అరుణాచలేశ్వరుడి పట్ల ఆయనకు జనక భావన ఉంది. మనందరకు మరణభయం ఉంటుంది. మన శరీరం నుండి జీవుడు బయటకు వెళ్లేటప్పుడు ఎలా ఉండాలి అంటే దీనికి వేదం ఏమి చెప్పింది అంటే దోసకాయ ముగ్గిన తరువాత మనం కొయ్యకుండానే అది తీగను వదిలేస్తుంది. తీగను ఏమీ బాధపెట్టదు. తీగను దోసకాయ ఎలా వదిలేస్తుందో అలాగ నిర్మలంగా మీ శరీరాన్ని జీవుడు విడిచిపెట్టేస్తే అది మంచి మరణం. అటువంటి మరణం పూర్వపుణ్యం ఉంటేనే కాని రాదు. ప్రపంచంలో అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి అని యక్షుడు ధర్మరాజును అడుగుతాడు. ప్రతీ మనిషి అనేకమంది చనిపోవటం చూస్తూ ఉంటాడు. మనం కూడా ఇలాగే శవం అయిపోతాము అనుకోడు. మనకు ఏమీ ఇబ్బంది లేదు, మనం ఇలాగే ఉంటాము అనుకొంటాడు. ఇది ఆశ్చర్యం అని ధర్మరాజు చెప్పాడు. ఈ వాక్యం భగవాన్‌కు చదివి వినిపించారు. అందులో ఆశ్చర్యం ఏముంది అన్నారు భగవాన్. ప్రతీవాడి హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావు ఎలా ఉంటుందో, పుట్టుక ఎలా ఉంటుందో తెలియదు. అది వాడై ఉన్నాడు. చనిపోయే శరీరం వాడుకాదు. వాడు ఏదిగా ఉన్నాడో దానికి చావు లేదు. అందుచేత నాకు చావురాదు అనుకొంటున్నాడు. అందులో పొరపాటు లేదే అన్నారు భగవాన్.

మీ దేహప్రారబ్ధాన్ని ఎంజాయ్ చేయండి అని ఆచార్యులవారు చెప్పారు. ప్రతీ దేహానికి ఒక ప్రారబ్ధం ఉంటుంది. ప్రారబ్ధం లేకపోతే అసలు దేహమే రాదు. మీ ప్రారబ్ధంలో సుఖం ఉంటుంది, దుఃఖం ఉంటుంది. మీ ప్రారబ్ధం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా దానిని ఎంజాయ్ చెయ్యండి. మీరు ప్రారబ్ధాన్ని ఆముదం మింగినట్లు మింగకండి, పాయసం నోట్లో పోసుకొన్నప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తారో అలా మీ ప్రారబ్ధాన్ని ఎంజాయ్ చెయ్యండి. అలా ఎంజాయ్ చేయటం వలన మీ ప్రారబ్ధం ఖర్చు అయిపోతుంది. తరువాత శరీరం వచ్చినప్పుడు ఇటువంటి ప్రారబ్ధం మీకు రాదు. ఎంజాయ్ ప్రజంట్ ప్రారబ్ధం. అప్పుడు మీకు మోక్షస్థితిని పొందటానికి అనుకూలపరిస్థితులు వస్తాయి, వాసనాక్షయం అవ్వటానికి అనుకూలమైన సహవాసాలు దొరుకుతాయి. ప్రస్తుతం మీ దేహానికి ఇచ్చిన ప్రారబ్ధాన్ని మీరు ఎంజాయ్ చేస్తే రాబోయే జన్మలో ఇన్ని లాభాలు వస్తాయి అని ఆచార్యులవారు చెప్పారు. చావు, పుట్టుక అని అలా కంగారు పడిపోతున్నారు ఏమిటి. మీ ఇంట్లో ఒక గదిలో నుండి ఇంకోగదిలోకి తిరుగుతున్నారు కదా. అప్పుడు మీకు భయం వేయటం లేదుకదా. ఒక

శరీరం విడిచిపెట్టి ఇంకో శరీరం లోనికి వెళ్ళటం కూడా అటువంటిదే అన్నారు రామకృష్ణుడు.

రూపమును పట్టుకొని పుట్టును, రూపమును పట్టుకొని పెరుగును, ఒక రూపమును విడిచిపెట్టి ఇంకొక రూపమును పట్టుకొనును ఈ రూపాన్ని పట్టుకొనే దానికి రూపంలేదు, దానినే అహంకార పిశాచము అంటారు. దానికి రూపం లేదు కాని రూపాలను పట్టుకొంటుంది. ఆ జబ్బు దానికి వదిలించాలి. మీకు అందరికీ ఉండాలని ఉంది. చనిపోవాలని ఎవరికీ లేదు. ఆ ఉండటమే దేవుడు మీ శరీరం ఉన్నా లేకపోయినా, ఈ ప్రపంచం కనిపించినా కనిపించకపోయినా మీరు ఉంటారు. కాని ఉంటామన్న సంగతి మీకు తెలియటం లేదు. ఆ ఉండటం అనే అనుభవం కనుక మీకు వస్తే మీరు ప్రపంచం అంతా ఉంటారు. ఇక్కడ లేము, అక్కడ ఉన్నాము అనే భావన మీకు రాదు. అప్పుడు అన్‌లిమిటెడ్ పీస్, అన్‌లిమిటెడ్ హేపీనెస్ ఇవన్నీ మీకు అనుభవం లోనికి వస్తాయి. మరణం అనేది మీ జోలికి రాదు. మీకు కోరికను బట్టి కర్మ ఉంటుంది. మీకు కోరిక ఉంటే దానిని ఎంజాయ్ చెయ్యాలి కాబట్టి మీకు దేహం వస్తుంది. మీరు సినిమా చూడాలంటే కళ్ళు ఉండాలి, కళ్ళు ఉండాలంటే శరీరం రావాలి. మీకు ఏదైనా కోరిక ఉంటే దానిని నెరవేర్చుకోవటానికి మీకు దేహం వస్తుంది. మీకు కోరికే లేనప్పుడు ఇంక మీకు దేహం రాదు. ఎందుచేతనంటే అవసరం లేదు కాబట్టి. మీకు ఎవరయినా అన్నం పెడతాము అంటే మీకు ఆకలి లేదు అనుకోండి, మాకు అన్నం వద్దు అని చెపుతారు. అలాగే శరీరం అవసరం లేని స్థితిని మీరు లోపల పొందాలి, ఆ మెచ్యూరిటీ లోపల రావాలి. కోరికలు లేని స్థితిని మీరు లోపల పొందితే ఇంక మీకు దేహాలు రావు. దేహం వస్తే ప్రపంచం వస్తుంది. ప్రపంచం వస్తే దేవుడు వస్తాడు. అక్కడ నుండి యాత్రలు, నదీస్నానాలు, పుణ్యాలు, పాపాలు ఆ అడివి అంతా వచ్చేస్తుంది. శరీరంతో పాటు ఫారెస్టు అంతా వచ్చేస్తుంది. నీకు శరీరం లేనప్పుడు ప్రపంచం లేదు, ప్రపంచం లేనప్పుడు దేవుడు లేడు.

గురువు చేసే సహాయం ఎలా ఉంటుంది అంటే నీకు సహాయం చేస్తే అది నీ ప్రక్క వాళ్ళకు తెలియాలి అని ఆయన అనుకోడు. ఆయన చేసేది సైలెంట్‌గా చేస్తాడు. గురువు నీకు ఏదో ఇచ్చేస్తున్నాడేమో అనిపిస్తుంది. నీకేదో ఇవ్వటం కాదు. నీ హృదయంలో ఉన్నది నీకు ఎఱుకలోనికి రాకుండా ఏది అడ్డు వస్తోందో అది గురువుకు తెలుస్తూ ఉంటుంది. ఏ వాసనలు, ఏ కోరికలు అయితే నీకు అడ్డువస్తున్నాయో వాటిని నెమ్మదిగా తొలగిస్తాడు. నువ్వు కంగారు పడితే చెయ్యడు. ఆయన వాసనలను తొలగించేటప్పుడు నువ్వు తట్టుకోగలవా లేదా అని చూస్తాడు. వాడు టైము చూసుకొని స్లోగా స్టడీగా వర్క్ చేస్తాడు. నువ్వు కంగారు పడుతున్నావని ఆయన కంగారుపడడు. మీరు నాకు జ్ఞానం ఇస్తారా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. భగవాన్ ఏమన్నారంటే నేను నీకు జ్ఞానం ఇస్తాను, నువ్వు

తీసుకోగలవా, నువ్వు తట్టుకోగలవా అన్నారు. అంటే జ్ఞానం వచ్చినప్పుడు హృదయంలోనుండి ఆనందం పొంగివచ్చి, సహస్రాన్ని ముంచేస్తుంది. అప్పుడు నువ్వు తట్టుకోలేక పోవచ్చు. అందుచేత గురువు ఏమి చేస్తాడు అంటే నువ్వు భరించగలవా లేదా అని టైము చూసుకొని కుళాయిలో నీళ్ళు విడిచిపెట్టినట్టు నెమ్మదిగా విడిచిపెడతాడు ఇక్కడ గ్రహించవలసింది ఏమిటి అంటే మీరు గురువును పట్టుకొంటే మీరు వదిలేయవచ్చు, కాని గురువు కనుక మిమ్మల్ని పట్టుకొంటే ఇంక వదిలే సమస్య లేదు, అన్నీ ఆయనే చూసుకొంటాడు. ఒక భక్తుడు భగవాన్‌తో ఏమన్నాడు అంటే నేను బద్ధకస్తుడిని, నేను ఏమీ చేసుకోలేను, మీరే బియ్యం తేవాలి, అన్నం మీరే వండాలి, అరిటాకు మీరే తేవాలి, మీరే కలిపి నోట్లో పెట్టాలి, అన్నీ మీరు చేయవలసిందే అని చెప్పాడు. భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు చెప్పినవన్నీ నేనే చేస్తాను, కాని ఒక్క పనిమటుకు నువ్వు చెయ్యాలి. నేనే నోట్లో పెడతాను కాని మింగటం అనే పని నువ్వు చెయ్యాలి. అది చెయ్యటానికి సిద్ధంగా ఉంటే మిగతా పనులు అన్నీ నేనే చేస్తాను అన్నారు. గురువు నిజంగా ఇవన్నీ చేస్తాడు. ఆయన మాట, చూపు, ప్రవర్తన, ఆలోచన అంతా దయే. మీరు స్పిరిట్యువల్‌గా ఎంత ఎడ్వాన్స్ అయితే అంత, లోకానికి మీ ద్వారా సహాయ సహకారములు అందుతాయి. భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు ఇతరులకు ఏది ఇచ్చినా అది తిరిగి నీకే వచ్చేస్తుంది అని తెలిస్తే ఇవ్వకుండా ఎలా ఉండగలవు? ఇది మీకు అర్థమైతే శాక్రిఫైస్ ఏముంది? ఎదుటివాడికి ఏది ఇచ్చినా తిరిగి నీకే వచ్చేస్తుంది అనే సంగతి నీకు అర్థమైతే ఇంక గివ్వింగ్ ఏముంది? ఇంక గివర్ లేడు, టేకర్ లేడు. ఇది షేరింగే. వాళ్ళు వేరు, నువ్వు వేరు అనుకొన్నప్పుడు వారికి ఏదో ఇచ్చాము అని నీకు అనిపిస్తుంది. వాడూ, నువ్వు ఒక్కటే అని నీకు అర్థమయినప్పుడు ఇంక ఇవ్వటం ఏముంది? ఇవ్వటం లేదు, తీసుకోవటం లేదు.

నాకు ఎవరో ఒకరు గురువు ఉండాలి కదా, ఏదో రూపం సపోర్టు ఉండాలి కదా అని ఇజ్రాయిల్ నుండి వచ్చిన ఒక భక్తుడు నన్ను అడుగుతున్నాడు. నువ్వు అరుణాచలం వస్తున్నావు కదా ఆ కొండను ఎన్నుకో, ఆ కొండ నీకు నచ్చకపోతే భగవాన్ రూపాన్ని ఎన్నుకో ఏదో సపోర్టుకోసం అని చెప్పాను. మీరు చెప్పింది బాగానే ఉంది కాని మిమ్మల్ని చూసినప్పటి నుండి మీ రూపం మీదే నా మనస్సు పడిపోతోంది అన్నాడు. ముల్లును ముల్లుతోటే తీసేయాలి. నారూపం అబద్ధమే, నీరూపం అబద్ధమే. ఒక అబద్దాన్ని పట్టుకొని ఇంకో అబద్దాన్ని తీసేసుకో. నారూపం నీకు ఇష్టమైతే నారూపాన్ని పట్టుకొని నీ రూపబుద్ధిని తీసేసుకో. నీకు రూపబుద్ధి పోయిన తరువాత ఇంక నారూపం నీకు అవసరం లేదు. అప్పటివరకూ ఉపయోగించుకొని తరువాత వదిలెయ్యి అని చెప్పాను. ఎవరిని గురువుగా నన్ను ఎన్నుకోమంటారు అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నీ మనస్సు ఎవరితోటి అయితే శృతికలుపుతోందో,